# బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో ఆంధ్రా నాయకులు



35వ డివిజన్‌లో మంత్రి గంగుల, మేయర్ సునీల్‌రావును శాలువాలతో సత్కరిస్తున్న డివిజన్ ప్రజలు

- తెలంగాణ సంపదను దోచుకునేందుకు వస్తున్నరు
- అద్భుత నగరంగా కరీంనగర్‌ను తీర్చిదిద్దినం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, అక్టోబర్ 4: తెలంగాణ సంపదను దోచుకునేందుకు మళ్లీ కాంగ్రెస్, బీజేపీ ముసుగులో ఆంధ్రా నాయకులు వస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలో బుధవారం ఆయన మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి సుడిగాలి పర్యటించారు. 20వ డివిజన్‌లో రూ.4 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైప్ లైన్ పనులు, 56వ డివిజన్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ, పైప్‌లైన్ పనులు, 34వ డివిజన్ (గోదాంగడ్డ)లో సీసీ రోడ్లు, 35వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. ఆరెపల్లిలో రేషన్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల సమయంలోనే కనిపిస్తారని విమర్శించారు. కాంగ్రెస్ టికెట్ కోసం దొంగలు, రౌడీలు దరఖాస్తు చేసుకున్నారని, వారిపై రౌడీషీట్‌తో పాటు 50కి పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. అలాంటి వారిని గెలిపిస్తే ప్రజల భూములను కబ్జా చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరెపల్లి నగరపాలక సంస్థలో విలీనమైన తర్వాత అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. ఆరెపల్లి అభివృద్ధికి ఎన్ని కోట్లు అయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కరీంనగర్ గడ్డపై తనకు హ్యాట్రిక్ విజయాలు కట్టబెట్టిన ప్రజలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఆరెపల్లిలో ప్రస్తుతం రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఆరెపల్లిలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమైక్య పాలనలో కరీంనగర్ అభివృద్ధి కోసం అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వద్దకు వెళ్లి నిధులు కావాలని దరఖాస్తు ఇచ్చి దండం పెడితే వెకిలిగా నవ్వారే తప్ప రూపాయి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తెలంగాణ నీళ్లు, బొగ్గు, కరెంట్, హైదరాబాద్ సంపదను దోచుకొని ఆంధ్రాకు తరలించుకెళ్లారని విమర్శించారు. స్వరాష్ట్రంలో కరీంనగర్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ వేలకోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇప్పుడు సాగు నీరు, కరెంటు కొరత లేదన్నారు. దీంతో భూమికి బరువయ్యే పంటలతో యావత్ దేశానికే తెలంగాణ అన్నపూర్ణగా అవతరించిందన్నారు. పచ్చని తెలంగాణను చూస్తే కాంగ్రెస్, బీజేపీల కడుపు మండుతున్నదని విమర్శించారు. ఇక్కడి సంపదను మళ్లీ దోచుకునేందుకు ఆంధ్రా నాయకులు ముసుగులు వేసుకుని తెలంగాణకు వస్తున్నారన్నారు. మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి బీజేపీ పేరుతో తెలంగాణలో అడ్డావేస్తే, కేవీపీ, షర్మిల కాంగ్రెస్ పేరుతో ఇక్కడ పాగా వేశారన్నారు. ఢిల్లీ పాలకుల చేతుల్లోకి తెలంగాణ వెళ్తే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారి గుడ్డి దీపంగా మారుతుందని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు అధికారం కట్టబెడితే ఇక్కడి బొగ్గు, నీళ్లు, కరెంట్, హైదరాబాద్ సంపదను దోచుకెళ్తారని చెప్పారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. నేను మీ బిడ్డగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. సంవత్సరానికో సీఎం మారే పార్టీ కావాలా?, ఐదేళ్లు ఒకే సీఎం ఉండి అభివృద్ధి చేసే పార్టీ కావాలో ఆలోచన చేయాలన్నారు. కరీంనగర్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ సహకారంతో నగరంలో వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి పర్యాటకులను ఆకర్షించేందుకు నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చామని, ఏడాదిలోగా మానేరు రివర్ ఫ్రంట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తుల రాజేశ్వరి-బాలయ్య, వంగపల్లి రాజేందర్‌రావు, అంజుమ్ బర్కత్‌అలీ, చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కళ్యాణి, గుగ్గిళ్ల జయశ్రీ, అజిత్‌రావు, నాయకులు శ్రీనివాస్, సదానందచారి, సూర్యశేఖర్, భూమాగౌడ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.





ఏకగ్రీవ తీర్మాన కాపీని కౌశిక్‌రెడ్డికి అందజేస్తున్న కిరాణ వర్తకం సంఘం నాయకులు, సభ్యులు, హుజూరాబాద్ కన్స్యూమర్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ సభ్యులు

# హుజూరాబాద్‌లో గులాబీ జోష్

- బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న మద్దతు
- కౌశిక్‌రెడ్డికి మద్దతుగా పలు సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు
- హుజూరాబాద్‌ను మరో సిద్దిపేట చేస్తా: మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 4: హుజూరాబాద్‌లో గులాబీ గుబాలిస్తున్నది. పార్టీ హవా జోరుగా నడుస్తున్నది. ఓ వైపు మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రచారంలో దూసుకెళ్తుండగా, మరోవైపు తామంతా బీఆర్‌ఎస్ వెంటే ఉంటామని, వచ్చే ఎన్నికల్లో ఏకగ్రీవంగా మద్దతు ఇస్తామంటూ పలు అసోసియేషన్లు ముక్తకంఠంతో చెబుతున్నాయి. పార్టీ అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయి.

### జైకొట్టిన ఏడు సంఘాలు

మండలి విప్ కౌశిక్‌రెడ్డికి హుజూరాబాద్‌లోని ఏడు సంఘాలు మద్దతు పలికాయి. హుజూరాబాద్ కన్స్యూమర్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్, కిరాణ వర్తకం సంఘం, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, మోటార్ ఫీల్డ్ అసోసియేషన్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వేర్వేరుగా ఏకగ్రీవ తీర్మానాలు చేసుకున్నాయి. బుధవారం ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని కలిసి వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంటుందని నాయకులు వెల్లడించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, బిజినెస్ ఫ్రెండ్లీ ప్రభుత్వాన్ని కాపాడుకుంటామని ఆయా సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. కౌశిక్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పునరుద్ఘాటించారు. సీఎం కేసీఆర్ దేశంలోనే ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, పనిచేసే ప్రభుత్వాన్ని కాపాడుకుంటామని చెప్పారు.

### హుజూరాబాద్‌ను మరో సిద్దిపేట చేస్తా

నాకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా. మరో సిద్దిపేటగా మారుస్తా. ప్రజా సమస్యలన్నీ పరిష్కరించి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. వచ్చే ఎన్నికలు హుజూరాబాద్ అభివృద్ధికి అత్యంత కీలకం. పనిచేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుంది. ప్రతిపక్ష నేతకు అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత అభివృద్ధి కుంటుపడుతుంది. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు కృషి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. గులాబీ పార్టీకి మద్దతుగా పలు సంఘాలు ఏకగ్రీవ తీర్మానాలు చేయడం హర్షనీయం. ఇదొక విప్లవం. ఎవరేమన్నా హుజూరాబాద్‌లో గులాబీ ప్రభంజనం నడుస్తోంది. ఈ సారి ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా రావు.

- హుజూరాబాద్‌లో విలేకరులతో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి



పొరండ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి, పక్కన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, తదితరులు

# పర్యటిస్తూ.. ప్రారంభిస్తూ..

- తిమ్మాపూర్ మండలంలో ఎమ్మెల్యే రసమయి సుడిగాలి పర్యటన
- అభివృద్ధి పనులు ప్రారంభం

తిమ్మాపూర్, అక్టోబర్ 4: మండలంలో బుధవారం రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మహాత్మానగర్, తిమ్మాపూర్, పొరండ్ల, మల్లాపూర్, రామకృష్ణకాలనీ, గొల్లపల్లి గ్రామాల్లో రోజంతా విశ్రాంతి లేకుండా తిరిగారు. మహాత్మానగర్‌లో వారసంతను ప్రారంభించి, తిమ్మాపూర్‌లో పలు కుల సంఘాలు, పొరండ్ల సొసైటీ గోదాంతో పాటు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు భారీ బైక్ ర్యాలీ తీశారు. మల్లాపూర్‌లో మహిళా సంఘం, గ్రామ పంచాయతీ భవనం, శ్మశానవాటికను ప్రారంభించారు. అనంతరం పొరండ్లలో కుల సంఘాలు, మహిళా సంఘం, పొరండ్ల సొసైటీ గోదాంను ఆయన నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, స్వరాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని స్పష్టం చేశారు. ఎట్లున్న గ్రామాలు ఎంతలా మార్పు సాధించాయో వివరించారు. కాళేశ్వరం జలాలతో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందుతున్నట్లు తెలిపారు. గతంలో ఎల్ఎండీ నుంచి అతితక్కువ సాగునీరు వచ్చేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ చేసిన అనేక సంస్కరణలతో పల్లెలు నేడు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. దాని ఫలితమే మండలానికి జాతీయ అవార్డు వచ్చిందన్నారు. అభివృద్ధి చేసుకునేంత నిధులు ప్రభుత్వం ఇస్తోందన్నారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎంతగానో చేస్తున్నారని.. తెలంగాణలో రామరాజ్యం వచ్చిందన్నారు. కాళేశ్వరం జలాలతో తెలంగాణలో భూమికి బరువయ్యేలా వడ్లు పండుతున్నాయని సంతోషించారు. దేశానికి అన్నం పెట్టేస్థాయికి తెలంగాణ రైతన్న ఎదిగేలా సీఎం కేసీఆర్ అద్భుతం సృష్టించారన్నారు. రాముడు ఏలాడని చెబుతున్న రాజ్యం నుంచి తెలంగాణకు వలసలు వస్తున్నారని.. మన రైతు రాజు అయినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంపై కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. కేంద్రం వడ్లు కొనకుంటే.. రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుని వడ్లు కొనుగోలు చేసి నిల్వ ఉంచారని గుర్తు చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి రైతుల ఆశీర్వాదం ఉండాలని కోరారు. నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎంతగానో చేస్తున్నారన్నారు. ప్రపంచంలోనే మేటి ప్రాజెక్టు కాళేశ్వరంతో 4 నుంచి 6 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగినట్లు చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలానే సహకార సంఘాల అభివృద్ధి జరుగుతున్నాయని, రూ.వేలల్లో రుణాలు ఇచ్చే సంఘాలు నేడు రూ.లక్షల రుణాలు ఇచ్చేస్థాయికి ఎదిగాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కేతిరెడ్డి వనిత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచులు జక్కని శ్రీవాణి, దుండ్ర నీలమ్మ, మీసాల అంజయ్య, రెడ్డి త్రివేణి, మామిడి సతీశ్, మల్లెత్తుల అంజయ్యయాదవ్, ఎంపీటీసీలు వేల్పుల మమత, పుప్పాల కనకయ్య, కనకం కొమురయ్య, కిన్నెర సుజాత-సారయ్య, సొసైటీ చైర్మన్లు సింగిరెడ్డి స్వామిరెడ్డి, గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచులు, సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వస్తున్న యువకులు

## బస్తీ దవాఖాన ప్రారంభం

విద్యానగర్, అక్టోబర్ 4: నగరంలోని 27వ డివిజన్ (ఆరెపల్లి)లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ బుధవారం ప్రారంభించారు. ఆరెపల్లి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు బస్తీ దవాఖానను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ తుల రాజేశ్వరి-బాలయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లలితా దేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్